క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పేట ఉత్సవం



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల అవతారోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళశాసనోత్సవం, పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఈఓ ఎ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ట్రై సైకిల్ వితరణ



నెల్లూరు(బారకాసు) : రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఓ దివ్యాంగురాలికి ట్రైసైకిల్‌ను వితరణ చేశారు. స్థానిక 17వ డివిజన్, యాకోనగర్, గిరిజనకాలనీకి చెందిన చెంచమ్మ అనే దివ్యాంగురాలికి ధనలక్ష్మీపురంలో రెడ్ల ఐక్య వేదిక వేదిక అధ్యక్షుడు కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తన ఇంటి వద్ద కార్పొరేటర్ పేనేటి సుధాకర్‌తో కలిసి గురువారం ట్రై సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాముల రమణయ్య తదితరలు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం



నెల్లూరు(బృందావనం) : కొండాయపాళెం రోడ్డు వసంతోపు సెంటర్ దగ్గర ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో చిన్నారులకు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ టి.మాధవి పాల్గొని, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ట్రస్ట్ ఫౌండర్ టైటస్ నిర్మల్‌కుమార్, శారద, ఎ.జయప్రకాష్, డేవిడ్ లివింగ్‌స్టన్, క్రాంతి, శశి, రమ, బాబు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌తో కమిషనర్ భేటీ

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పి.స్రవంతితో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వైఓ నందన్ భేటీ అయ్యారు. కార్పొరేషన్ కార్యాలయ మేయర్ చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలి

నెల్లూరు(అర్బన్) : 60 ఏళ్లు నిండిన వారి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీనియర్ సిటిజన్ కార్డులను మీ–సేవ కేంద్రాలు, జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా పొందవచ్చని మీ–సేవ, ఈ–సేవ ఫ్రాంచైజర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాయితీతో పాటు పాస్‌పోర్టు సేవా ఫీజుల్లో రాయితీ పొందవచ్చన్నారు. కోర్టు కేసుల విచారణలోనూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అదనపు వడ్డీ వస్తుందన్నారు. రైలులో ప్రత్యేక సదుపాయంతో పాటు పన్ను మినహాయింపులు కూడా ఉంటాయన్నారు.

పర్యాటకులపై కాల్పులు పిరికిపంద చర్య

నెల్లూరుసిటీ : పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం పిరికిపంద చర్య అని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి గురువారం అన్నారు. ఈ దాడిని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాల్పుల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చివరి మజిలీకీ తిప్పలే

- శ్మశానవాటికల నిర్వహణ గాలికి..
- పట్టించుకోని నగరపాలక సంస్థ
- అంత్యక్రియలు చేయాలంటే అంతులేని కష్టాలు

నెల్లూరు నగరంలోని శ్మశానవాటికలు కనీస వసతులకు దూరంగా ఉంటున్నాయి. పలుచోట్ల శ్మశానవాటికల నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు చేతులెత్తేశారు. ఇక్కడ వసతులు, సదుపాయాల కల్పన కలగా మారిపోయింది. దీంతో చివరి మజిలీలో కూడా తిప్పలు తప్పడం లేదు.



కొత్తకాలువ శ్మశాన వాటికకు వెళ్లే బాట

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 15కుపైగా శ్మశానవాటికలు ఉన్నాయి. విలీన పంచాయతీలతో పాటు 50 డివిజన్లలో ఇన్ని శ్మశానవాటికలు ఉన్నాయనే విషయం కార్పొరేషన్ యంత్రాంగానికి కూడా సక్రమంగా తెలియదు. వీటిలో మైపాడురోడ్డులోని రోటరీ పూండ్ల చెంచురెడ్డి కైలాసభూమి (బోడిగాడితోట) తప్ప మరే శ్మశానవాటిక వద్ద కనీస సౌకర్యాలు కనిపించవు. కనీసం నడవడానికి కూడా దారి లేకుండా ముళ్ల కంపలతో నిండిపోయిన శ్మశాన వాటికలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటిచోట్ల అంత్యక్రియలు నిర్వహించడం ఓ ప్రహసనంగా మారింది. మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి గుంతలు తీసే అవకాశం ఉండదు. ఎటు చూసినా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంటున్నాయి. ఇక కాష్టం పెట్టే ఆచారం ఉన్న వాళ్ల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మృతదేహానికి కాష్టం పెట్టేప్పుడు కనీసం పైకప్పు కూడా ఉండదు. కాలుతున్నప్పుడు వర్షం పడితే అంతే సంగతులు. నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తకాలువ, పడారుపల్లి, బుజబుజనెల్లూరు తదితర ప్రాంతాల వద్ద శ్మశానవాటికల్లో ఇలాంటి దృశ్యాలు నిత్యం తారసపడుతుంటాయి. ఎలాగో నానా తంటాలు పడి అంత్యక్రియలు పూర్తి చేసి, తిరిగి వెళ్లేటప్పుడు కాళ్లు, చేతులు కడుక్కోవడానికి కనీసం నీరు కూడా ఉండటం లేదు. ఇక శుభ స్వీకరణ కార్యక్రమాలు శ్మశాన వాటికల్లో చేసేవాళ్లయితే అన్నీ ఇంటి నుంచే తెచ్చుకునే పరిస్థితి తప్పడం లేదు.

ఎందుకీ నిర్లక్ష్యం

శ్మశానవాటికలపై నగరపాలక సంస్థ అధికారులు ఆది నుంచి పెద్దగా దృష్టి సారించిన పాపాన పోలేదు. ఈ ప్రదేశాలు తమకు సిరులు కురిపించవని అనుకున్నారో..? కాసులు కురిపించే కల్పవృక్షాలు కావనుకున్నారో..? అధికారులకే తెలియాలి. చిన్నపాటి మురుగునీటి కాలువలో అర్ధగంట పూడిక తీయించి, 48 గంటలు యంత్రాలతో పనులు చేసినట్లు తప్పుడు బిల్లులు సృష్టించే వారు పారిశుద్ధ భాగంలోనే కనిపిస్తారు. అలాంటి అధికారులే శ్మశానవాటికల నిర్వహణ బాధ్యత కూడా చూడాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం ఏ చిన్నపని చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక్కడ కూడా అవినీతి చేయాలని కాకుండా.. కాస్త మానవతా దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. శ్మశానవాటికలకు కాటికాపరుల ఏర్పాటు, నీటి సౌకర్యం, కూర్చోవడానికి చిన్నపాటి షెడ్ల నిర్మాణంపై ఇప్పటికైనా ఎన్‌ఎంసీ అధికారులు దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారు.

చర్యలు తీసుకుంటాం



శ్మశానవాటికల నిర్వహణ మాదే. నగరంలో ఎన్ని శ్మశాన వాటికలు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి? ఏయే వసతులు ఏర్పాటు చేయాలనే దానిపై మా వాళ్లతో మాట్లాడుతాం. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా వసతులు లేని శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ చైతన్య, హెల్త్ ఆఫీసర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్





కొత్తకాలువ వద్ద ముళ్ల కంపలతో నిండిపోయిన శ్మశానవాటిక

పూడికతీతను క్రమం తప్పకుండా చేపట్టండి



చెత్త సేకరణపై సూచనలు ఇస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేతను క్రమం తప్పకుండా జరపాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక రెండో డివిజన్ సిరి గార్డెన్, నరుకూరు సెంటర్, గుడిపల్లిపాడు, బృందావనం గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రెయిన్ నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని, ఖాళీ స్థలాల పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. భవన నిర్మాణ సామగ్రి రోడ్లను ఆక్రమించకుండా వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణ ప్రణాళికా విభాగం అనుమతుల ప్రకారం మాత్రమే నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని, అనుమతుల్లేకుండా అదనపు నిర్మాణాలు జరుగుతుంటే వెంటనే నిలిపివేయాలన్నారు. స్థానిక కార్పొరేటర్ రామ్మోహన్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

- పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య స్థానిక ఎనిమిదో డివిజన్ కామాటి హరిజనవాడ, తొమ్మిదో డివిజన్ నజీర్‌తోట, పుట్టవీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు



రాష్ట్ర సదస్సుకు హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల్లూరు (పొగతోట) : జిల్లా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పూలమాల వేశారు. అనంతరం జెడ్పీ ఏఓలు కొండయ్య, వసంతమ్మ, డీపీఓ కార్యాలయ ఏఓ మాలకొండయ్యలను సన్మానించారు. కార్యాలయ అధికారులు సుబ్రహ్మణ్యం, రవికుమార్, లక్కాకుల పెంచలయ్య, బీవీ రమేష్‌బాబు, శివ, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సులో..

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో రాష్ట్రస్థాయి సదస్సు గురువారం నిర్వహించారు. కోవూరు, కోట జెడ్పీటీసీ సభ్యులు శ్రీలత, కోటయ్య, కోవూరు ఎంపీపీ పార్వతి, నాయుడుపేట ఎంపీపీ ధనలక్ష్మి, ఆత్మకూరు ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, జలదంకి ఎంపీపీ వెంకటరమణ, వెంకటాచలం ఎంపీపీ కవిత హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

26న డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 26న జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తడ, చెన్నై, శ్రీసిటీ ప్రాంతాలకు చెందిన పలు కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరు కానున్నట్లు చెప్పారు. వయస్సు 27 ఏళ్లలోపు కలిగి పదో తరగతి, ఇంటర్ అర్హత కలిగిన యువతీ, యువకులు తమ రెజ్యూమ్‌లతో పాటు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 90306 65477 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

28 నుంచి సమ్మర్ క్యాంప్

నెల్లూరు(బృందావనం) : మినీ బైపాస్‌రోడ్డు దగ్గర ఇస్కాన్ మందిరంలో బాలలకు ఈనెల 28 నుంచి మే 2వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్ స్వామి గురువారం తెలిపారు. ఆరు నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, పఠనం, వేదాల నుంచి సృజనాత్మక కథలు, కీర్తనలు, డ్రాయింగ్, వేదాలకు సంబంధించిన క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 88866 63140, 96876 32229 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కానిస్టేబుల్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్) : కావలి రూరల్ కానిస్టేబుల్ ఎస్.నాగరమేష్(37) మృతికి ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీహరి ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. నాగరమేష్ అనారోగ్యంతో చెన్నైలోని ఎంజీఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఈ క్రమంలో మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సాగునీటి సంఘాలతో ఆర్డీఓ సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

నెల్లూరు సిటీ : రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో డబ్ల్యూయూఏ(సాగునీటి సంఘాలు) చైర్మన్లు, డిస్ట్రిబ్యూషన్ కమిటీ సభ్యులతో ఆర్డీఓ అనూష నీటి పన్ను మాడ్యుల్ సేకరణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని బట్టి బకాయిలు చెల్లించేందుకు డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ సచివాలయాల వద్ద నీటి పన్ను చెల్లించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్‌లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు చెక్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ సుజాత, డీఎంఓ హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్) : దోమల నివారణతోనే మలేరియాను అరికట్టవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుజాత, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలను వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమకాటు వల్ల ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సీఫరమ్ అనే పారాసైట్స్ మనిషిలోకి ప్రవేశించి మలేరియా జబ్బును కలిగిస్తాయన్నారు. కాగా శుక్రవారం వైద్యశాఖ కార్యాలయం నుంచి జరిగే ర్యాలీ, అవగాహన సదస్సులో డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొనాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ దయాకర్, అసిస్టెంట్ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ క్యాంపు



చిన్నారులకు వైద్య చికిత్సలు అందిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : స్థానిక ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో 15 ఏళ్లలోపు బాల, బాలికల కోసం ఏర్పాటు చేసిన న్యూరో మెడికల్ క్యాంపుతో ఎంతో ఉపయోగకరమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి అన్నారు. మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో ఆక్యుపేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, కౌన్సెలింగ్ మెడికల్ క్యాంపును గురువారం నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎదుగుదల లోపాలు సరిదిద్దుటకు, బ్రెయిన్ చికిత్స, బలహీనపడిన నరాలను సరిదిద్దేందుకు డాక్టర్లు వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. న్యూరోజన్ బ్రెయిన్, స్పైన్ ఇన్‌స్టిట్యూట్–ముంబై వారి ఆధ్వర్యంలో డాక్టర్లు సుచితాచౌదరి, సుశీల్ వైద్య చికిత్సలు అందించారు. 70 మంది పిల్లలను పరీక్షించి 40 మందిని మెరుగైన చికిత్సల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు జనార్దన్‌రాజు, సురేష్‌కుమార్ జైన్, రాజేంద్రప్రసాద్, ఎంవీ సుబ్బారెడ్డి, బలరామయ్యనాయుడు, రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈపై చర్యలకు వినతి



ఇరిగేషన్ ఈఈ నాగరాజుకు వినతి పత్రం అందజేత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వెంకటాచలం మండలం చెముడుగుంట కుంకుమపూడి చెరువు కబ్జాదారులతో చేతులు కలిపిన ఏఈఈపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మారంరెడ్డి రాధారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ నాగరాజును కోరారు. ఈ మేరకు హరనాథపురంలోని ఇరిగేషన్ శాఖ ఈఈ కార్యాలయంలో గురువారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరిగేషన్ పరిధిలో ఉన్న చెముడుగుంట కుంకుమపూడి చెరువు కబ్జాపై కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. అయితే సంబంధిత ఏఈఈ ఆక్రమణదారులతో చేతులు కలిపి ఫిర్యాదు చేసినందుకు తనపై స్థానికులను రెచ్చగొట్టి దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

న్యాయవాదుల కొవ్వొత్తుల ర్యాలీ



నెల్లూరు (లీగల్) : పహల్గామ్ ఉగ్రదాడికి నిరసన వ్యక్తం చేస్తూ న్యాయవాదులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐక్యవేదిక, న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణ నుంచి నెహ్రూ బొమ్మ వరకు గురువారం ర్యాలీ చేశారు. ఉగ్రవాదం నశించాలి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కుడుముల రవికుమార్, రంగారావు, అంకయ్య, జల్లి పద్మాకర్, పరిషత్ నాయకులు నాగశ్రీనివాస్, వైవీ సురేష్, పీజీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న జరుగుతుందని జిల్లా సంఘ కార్యదర్శి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 97055 43294, 80991 50909 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విజేతలకు అభినందన

వీబీఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలో..



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లూరు సిటీ : ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ కాటం శ్రీనివాసులురెడ్డి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా 590కి పైగా మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా కాటం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 590కి పైగా ఏడుగురు, 580కి పైగా 24, 570కి పైగా 54, 550కిపైగా 111 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఇఖ్రా పాఠశాలలో..



నెల్లూరు (టౌన్) : స్థానిక ఇఖ్రా పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించిన షేక్.మాహియా, 579 మార్కులు సాధించిన సనాఖాన్, 579 మార్కులు సాధించిన అస్మ ఇబ్రహీంలను ఎస్‌డీపీఐ అధ్యక్షుడు రియాజ్ గురువారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. భవిష్యత్‌లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హఫీజ్, ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

నారాయణ హాస్టల్ బ్రాంచ్‌లో..



నెల్లూరు (టౌన్) : పదో తరగతి ఫలితాల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారని నారాయణ హాస్టల్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్థానిక ధనలక్ష్మీపురంలోని నారాయణ హాస్టల్ బ్రాంచ్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటజితేష్‌కుమార్ 596, లక్ష్మీదీపక్ 595 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..



జువేరియాను అభినందిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నవలాకులతోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ అజీజ్ కుమార్తె మహ్మద్ జువేరియా పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జువేరియాను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మోహన్‌రావు, అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, శ్రీనివాసులు, రెహనాబేగం పాల్గొన్నారు.

నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో..



నెల్లూరు (టౌన్) : పదో తరగతి ఫలితాల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రామలింగాపురంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్ల దీక్షితప్రియ 598 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అదేవిధంగా కుందనవర్షిత, సాయిబిల్వేష్, తన్వి, రోహన్‌వరుణ్, భవ్యశ్రీలు 597 మార్కులు సాధించారన్నారు. 26 మంది విద్యార్థులు 595కుపైగా మార్కులు సాధించారన్నారు. జిల్లాలోని అన్ని నారాయణ పాఠశాలల్లో 98.4 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.